క్లుప్తంగా

నేటి మంత్రి పొంగులేటి పర్యటన వాయిదా



ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్: నేడు ఖమ్మం రూరల్ మండలంలో జరగాల్సిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సంబంధిత కార్యకలాపాలు ఉన్నందున పర్యటనను వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలోనే తదుపరి పర్యటన వివరాలు వెల్లడిస్తామని దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా మల్లన్నను గెలిపించాలి



మాట్లాడుతున్న శివరామకృష్ణ

తిరుమలాయపాలెం: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు చావా శివరామకృష్ణ కోరారు. నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే మల్లన్నకు ఈనెల 27న జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు ఓటు వేసేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని ఆయన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

మృతుడి కుటుంబానికి రూ.60వేల వితరణ

రఘునాథపాలెం: ఇటీవల మృతిచెందిన బొరిగోర్ల నర్సయ్య కుటుంబానికి గ్రామంలోని పలువురు దాతలు తమవంతుగా రూ.60 వేల నగదు, నిత్యావసర వస్తువులను గురువారం వితరణగా అందించారు. ఇందులో మాజీ ఉపసర్పంచ్ నున్నా వెంకటేశ్వర్లు రూ.33 వేల విలువైన నిత్యావసర సరుకులు, గ్రామ మాజీ సర్పంచ్ వడ్డే ప్రసాద్ ఒక క్వింటా బియ్యం అందించినట్లు గ్రామ యూత్ నాయకుడు తోటా వెంకట్ తెలిపారు.

నియామకం



రుద్రగాని మాధవరావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా రుద్రగాని మాధవరావుగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు రేఖ సత్యనారాయణ యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలపాక.. పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ఖమ్మంగాంధీచౌక్: 2024–25 ఏడాదికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్‌గా వైద్యుడు బొలికొండ శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఆమోదించారు. గురువారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ కార్యదర్శిగా గెల్లా శ్రీరామ్, కోశాధికారిగా ఆర్తి గోవిందరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.దుర్గ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా గడిపుడి జనార్ధన్‌రావులను ఎన్నుకున్నారు. కాగా, తన నియామకం పట్ల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్



కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	30	పాలకూర	4
పచ్చిమిర్చి	88		20
కాకర	60	చుక్కకూర	4
బీర	70		20
దొండ	36	తోటకూర	5
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	5
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	24	మెంతికూర	4
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	48		30
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	64		20

–ఖమ్మం వ్యవసాయం

గాడి తప్పుతున్న పాలన..



నియామకాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది

- అధికారులకు తెలియకుండానే కొత్త వారిని నియమిస్తున్న వైనం
- ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్న ఉద్యోగులు
- పెరిగిన ప్రైవేటు పెత్తనం
- పాలన గాడిన పడేదెన్నడో?

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బంది తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలపై పలు ఆరోపణలు, విమర్శలు రాగా.. మరోసారి అదే తీరును అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికుల నియామకం ఇష్టానుసారంగా జరుగుతుందని, అధికారులకు తెలియకుండానే పనుల్లో పెట్టి జీతాలు చెల్లిస్తున్నట్లు కేఎంసీలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇక మరికొంత మంది సిబ్బంది తమ బంధువులను కేఎంసీ కార్యాలయంలోని పలు విభాగాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫీల్డ్‌లో పని చేసే వారు తమ పలుకుబడిని వినియోగించుకొని క్షేత్రస్థాయి నుంచికార్యాలయానికి తమ పేర్లు మార్చుకునేందుకు కొంత మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

ప్రైవేటు వ్యక్తులతో పనులు..

అధికారుల పట్టింపు లేకపోవడంతో కేఎంసీలో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ కేఎంసీలో బహిరంగంగానే జరుగుతోంది. కేఎంసీలో కీలక విభాగం అయిన రెవెన్యూలో కొంత మంది బిల్లు కలెక్టర్లు తాము చేయాల్సిన విధులను ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని చేయించుకుంటున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఇటు కార్యాలయంలోనూ, అటు క్షేత్ర స్థాయిలోనూ పెరిగిపోయిందనే విమర్శలు ఉన్నాయి. బిల్లుల వసూళ్ల సమయాన, ఇంటి అనుమతులకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ సమయాన ప్రైవేటు వ్యక్తులు మాముళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిమ్మకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇష్టానుసార నియామకాలు, ప్రైవేటు వ్యక్తుల పెత్తనంపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. అవి తమ దృష్టికి రాలేదని, సమాచారం ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అధికారులకు తెలియకుండానే..



కేఎంసీలో పంపు ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకుంటారు. వీరు సంఘాలుగా ఏర్పడి డివిజన్లలో విధులు నిర్వర్తిస్తుంటారు. వీరిలో ఎవరైనా విధుల నుంచి తప్పుకుంటే ఆ సంఘాలు తీర్మానం చేసుకొని విధుల నుంచి తప్పుకున్న వారి బంధువులు, వారి మనుషులను పనిలోకి తీసుకుంటారు. కాగా, ఈ సమాచారాన్ని ముందుగానే అధికారులకు తెలుపుతారు. సంఘ తీర్మానం ప్రకారం కొత్త వ్యక్తికి విధులు తప్పుకున్న వ్యక్తి స్థానంలో పనిలోకి తీసుకోవడంతో పాటు వేతనం చెల్లిస్తారు. రెండు నెలల క్రితం ఖానాపురం హవేలి పరిధిలో ఓ పంపు ఆపరేటర్ విధుల నుంచి తప్పుకున్నారు. అయితే ఆయన స్థానంలో మరో పంపు ఆపరేటర్ బంధువును డబ్బులు తీసుకొని నియమించారు. అయితే ఈ విషయం అధికారులకు తెలపకుండానే విధుల్లో పెట్టి రెండు నెలలుగా వేతనాలను మంజూరు చేయించారు. అధికారులకు తెలపకుండా ఎస్టాబ్లిష్‌మెంట్‌లో వేతనాలు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలపకుండా విధుల్లోకి ఎలా తీసుకుంటారు?, వేతనాలు ఎలా చేస్తున్నారన్న చర్చ జరుగుతుంది.

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

కూసుమంచి: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఏఓ వాణి అన్నారు. గురువారం మండలంలోని ముత్యాల గూడెంలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడి పలు సూచనలు చేశారు. నకిలీ లేబుల్ ఉన్న ప్యాకెట్లలోని విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయొద్దని, విత్తన లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేసి తప్పకుండా రశీదు పొందాలన్నారు. రైతులు వేసవి దుక్కులు దున్నుకోవటం వలన ఎంతో ప్రయోజనంగా ఉంటుందని, మట్టి పరీక్షలను చేయించుకోవాలని ఏఓ సూచించారు. రైతులు వరి పంట అవశేషాలను తగులబెట్టటం వలన భూమిలో మేలు చేసే సూక్ష్మక్రిములు నశిస్తాయని, అగ్నిప్రమాదాలు సంభవిస్తాయని, దీన్ని రైతులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న రైతులతో ఏఓ వాణి

దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడాలి

నేలకొండపల్లి: దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడాలని నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిల్వ నీరు లేకుండా చూడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించడంతో పాటు డెంగీపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ చావా దుర్గ, డీపీఎంఎం సంధ్యా, హెచ్ఈఓలు చంద్రశేఖర్‌రావు, వీరన్న, పీహెచ్ఎన్ తిరుమలమ్మ, సూపర్‌వైజర్ తిరపతమ్మ, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమత్తుల నేపథ్యాన నగరంలోని 11 కేవీ కవిరాజ్‌నగర్ ఫీడర్ ఇల్లెందు క్రాస్‌రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్, కోర్టు ప్రాంతం, బైపాస్ న్యూవిజన్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11 కేవీ డైరీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మైసమ్మ టెంపుల్ సమీపాన మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఖమ్మం అర్బన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాత మెడికల్ కళాశాల ప్రాంతం, రాధాకృష్ణనగర్, మమత ఆస్పత్రి రోడ్, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించలన్నారు.

ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవర్చుకోండి

ఖమ్మంమయరిసెంటర్: ఆరోగ్యవంతమైన మానసిక, శారీరక దైనందిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం వల్ల బీపీ, షుగర్ వంటి వ్యాధులను నియంత్రించవచ్చని ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఏ.వీ.గిరిసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా బీపీపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఇప్పుడు రక్తపోటు యువకులకు కూడా వస్తోందని, దీనిని నియంత్రణలో ఉంచుకునేందుకు ఉప్పు ఎక్కువగా తినకుండా, బరువు పెరగకుండా చూసుకోవాలని, శారీరక శ్రమ, వ్యాయామం తప్పకుండా చేయాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు కూడా బీపీ, షుగర్ తదితర వ్యాధులపై అవగాహన కలిగి ఉండి.. నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

• నామ్‌కే వాస్తే..

కామేపల్లి: వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యాన చలివేంద్రాలను అట్టహాసంగా ఏర్పాటు చేశారు. ప్రారంభించిన చలివేంద్రాలు ప్రజలకు వారం రోజులే తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇటీవల అసలు చలివేంద్రాల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చే పోయే ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.



కుండలు లేకుండా ఉన్న ఓ చలివేంద్రం

ఈనెల 19న గానమాధురి

ఖమ్మంగాంధీచౌక్: ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు ఎస్.కె.అంజాద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని గాంధీ చౌక్ వర్తక సంఘ భవనంలో గాన మాధురి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె.అంజాద్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మొట్టమొదటిసారిగా తెలుగు, హిందీ సినీ మధుర గీతాలు ఆలపించబడతాయని పేర్కొన్నారు.

శివాలయ అభివృద్ధికి కృషి చేయాలి



డీటీకి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామంలో గల పురాతన శివాలయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గురువారం గ్రామస్తులు మండల డిప్యూటీ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి నర్సింహారావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పురాతన కాలం నాటి శివాలయం చుట్టూ లైట్లను అమర్చాలని, గుట్టపైకి ఎక్కేందుకు మెట్లు ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీ నుంచి వాటర్ కనెక్షన్ ఇప్పించి, మరింత అభివృద్ధి చేయాలని వినతిలో పేర్కొన్నారు.

మురళీకృష్ణ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన మండలంలోని కామంచికల్లు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చెరుకూరి మురళీకృష్ణ సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం మురళీకృష్ణ సంతాపసభ జరుగగా సీపీఎం నాయకుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మురళీకృష్ణ శక్తివంచన లేకుండా కృషి చేశారని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్, ఎం.సాయిబాబా, బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, ఎం.సుబ్బారావు, భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా నాయకుడు ఏజే.రమేష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు, నంద్ర ప్రసాద్, ఎస్.నవీన్‌రెడ్డి, నందిపాటి మనోహర్, పొన్నెకంటి సంగయ్య, బండారు రమేష్, షేక్ బషీరుద్దీన్, వేముల సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కామేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు సూచించారు. గురువారం కామేపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వందశాతం ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రతి నెలా పని తీరును, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సేవలను మెరుగుపరచాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిల్లో ప్రసవాలను ప్రోత్సహించకూడదని, క్లిష్టతరమైన గర్భిణుల జాబితా తయారు చేసుకుని పక్కా ప్రణాళికతో రవాణా సౌకర్యాల ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సమన్వయంతో మెదగాలని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాక వైద్య సేవలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి చందన, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

సంఘం బలోపేతానికి కృషి చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు కులంలో యూత్ అందరిని ఒక తాటిపైకి తీసుకొచ్చి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అన్నారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర యూత్ కార్యదర్శిగా ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన మాటేటి రవిని నియమిస్తూ నియామకపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘ అభ్యున్నతికి రవి కృషి ఎనలేనిదన్నారు. అనంతరం రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, వలసాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి శెట్టి రంగారావు, జిల్లా నాయకులు కనిశెట్టి నరసయ్య, డి.నరసయ్య, శెట్టి భాస్కర్, యూత్ నాయకులు అనిరుథ్, రమణ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



రవిని సత్కరిస్తున్న సంఘ బాధ్యులు

దార్శనికుడు మారోజు వీరన్న..

ఖమ్మం మామిళ్లగూడెం: విప్లవ పదం మార్గాన్ని నిర్ధేశించిన దార్శనికుడు మారోజు వీరన్న అని సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రబంజనయాదవ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భద్రూనాయక్ అన్నారు. వీరన్న 25వ వర్ధంతి సందర్భంగా గురువారం ఖమ్మంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారోజు వీరన్న ఓ సిద్ధాంత కర్త అని, నేటి విప్లవకారులకు వీరన్న మార్గదర్శకుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైతన్య, ఉపేంద్రబాయి, వీరనారిమణుల ఆశయ సాధన సమితి గౌరవ అధ్యక్షురాలు షేక్.నజీమా, జ్యోతి, చందు, త్రివేణి, వీరన్ననాయక్, రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కామేపల్లి: ఈజీఎస్ పనులకు హాజరయ్యే ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీడీ వెంకటపతిరాజు, కోర్స్ డైరెక్టర్ గాలయ్య అన్నారు. గురువారం మండలంలోని కామేపల్లి, కొమ్మినేపల్లి, నెమలిపురి, గోవింద్రాల, లింగాల గ్రామాల్లో అమృత్ సరోవర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. పనికి హాజరైన కూలీలకు పనికి తగ్గ వేతనం గురించి వివరించడంతో పాటు ప్రతీ కూలీకి వంద రోజులు పని దినాలను కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లోని చెరువుల్లో పూటికతీత పనులు కూలీల భాగస్వామ్యంతో ముమ్మరంగా కొనసాగుతున్నందున.. చెరువుల్లో మట్టిని రైతులు తమ పంట పొలాలకు తరలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, భావ్‌సింగ్, డేవిడ్ రాజు, సుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్లు అజ్మీర రమేష్‌నాయక్, ధరావత్ మాన్‌సింగ్ పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ గాలయ్య

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ వినతి

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, సీఐటీయూ జిల్లా నాయకుడు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి స్వీపర్లు, పేషంట్ కేర్, గార్డెన్ సెక్షన్, సెక్యూరిటీ తదితర కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను మంజూరు చేయాలని, లేనిక్షంలో భవిష్యత్తులో ఆస్పత్రిలో పనిచేస్తున్న 259 మంది కార్మికులతో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్, అంబేద్కర్, జగదీష్, రాందాస్, నాగమణి, ఉపేందర్, సునీత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



అటెన్షన్ ప్లీజ్

వ్యర్థాలు తొలగించరూ..!



బుర్హాన్‌పురంలోని ఓ డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు



బైపాస్ రోడ్డులోని ఓ హోటల్ నుంచి వచ్చిన వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

నగరంలో రోజురోజుకు పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడుతుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలో డ్రెయినేజీలను శుభ్రం చేయడంలో కార్మికులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తుండడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇక నగరంలోని పలు ప్రాంతాల్లో హోటళ్ల నుంచి వెలువడే పలు రకాల వ్యర్థాలతో పాటు గృహాల వ్యర్థాలను డ్రెయినేజీల్లో పోస్తుండడంతో అవి ఎక్కడికక్కడే అయిపోయి డ్రెయినేజీలు నిండుతున్నాయి. అంతే కాక డ్రెయిన్‌లలో ప్లాస్టిక్, సిల్ట్ పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - ఖమ్మంమయూరిసెంటర్